



శ్రీవారికి అలంకరించిన కుచ్చుల వాల్జెడ





హాజరైన భక్తులు



మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు



సమ్మోహన రూపం

మోహినిగా దర్శనమిచ్చిన ఖాద్రీశుడు

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, మార్చి 27: కుచ్చులు పెట్టిన వాల్జెడ, గుబాళించే మల్లెలు, యతికైనా మతిపోగొట్టే సోయగంతో, చంకన అమృతకలశాన్ని పెట్టుకుని మోహినీ అలంకరణలో కదిరి నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఆ సమ్మోహనమూర్తిని దర్శించుకోవడానికి వేలాది భక్తులు తరలిరాగా ఆలయ ప్రాంగణం, తిరువీధులు సందడిగా మారాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నరసింహస్వామి మోహినీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం యాగశాలలో నిత్య పూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యా సమయంలో మోహినీ అలంకారం చేశారు. బ్రహ్మోత్సవాల్లో అన్ని రోజుల్లోనూ శ్రీవారు తిరువీధుల్లో మాత్రమే విహరిస్తారు. మోహినీ ఉత్సవం రోజు కోరిన భక్తుడి ఇంటికి వెళ్లి దర్శనమిస్తారు. బుధవారం రాత్రి ఆలయం నుండి బయలుదేరిన శ్రీవారు తిరిగి ఆలయానికి వచ్చేది గురువారం మధ్యాహ్నానికే. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఉభయదారులు కోటా వెంకట్రామయ్య గుప్తా, లీలావతమ్మ, జయప్రకాష్, నారాయణ గుప్తా, సుజాత కుటుంబికులతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.


నేడు ప్రజా గరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనారసింహుడు గురువారం ప్రజా గరుడవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం నిత్య పూజ , హోమం అనంతరం గ్రామ సేవ నిర్వహిస్తారు. సంధ్యాసమయంలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఉత్సవానికి ఓ ప్రత్యేకత ఉన్నది. బ్రహ్మ గరుడ సేవను అన్ని బ్రహ్మోత్సవా ల్లో ఒక్క రోజు మాత్రమే నిర్వహిస్తారు. అయితే భక్తుల కోరిక మేరకు నిర్వహించే గరుడ ఉత్సవాన్ని ప్రజా గరుడ సేవ అని పిలుస్తారు.

ఆంధ్రజ్యోతి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవం March 19 - April 7 9వ రోజు

నేడు కదిరిలో ప్రజాగళం

- టీడీపీ అధినేత చంద్రబాబు రాక



కదిరి/ పుట్టపర్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజాగళం పేరిట గురువారం కదిరిలో పర్యటించనున్నారు. తొలుత అనంతపురం జిల్లాలో పర్యటించి సాయంత్రానికి కదిరికి రానున్నారు. అనంతపురం రూరల్ మండలం ప్రసన్నాయపల్లి హెలీప్యాడ్ నుంచి సాయంత్రం 4:45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5:10 కల్లా కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోకి చేరుకుంటారు. అక్కడే 6:30 గంటలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొంటారు. తర్వాత అక్కడి నుంచి రోడ్డుషో ప్రారంభించి కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా పూలే సర్కిల్‌కు చేరుకుంటారు. అక్కడ 7:30 గంటల దాకా ఎన్నికల ప్రజాగళం సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం రోడ్డు మార్గాన స్థానిక మదనపల్లి రోడ్డులో గల పీవీఆర్ గ్రాండ్‌కు 7:45 చేరుకుని అక్కడ బస చేస్తారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టీడీపీ అభ్యర్థి యశోదాదేవి, నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున సభ ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు ఇఫ్తార్ విందు: కందికుంట



కదిరి: స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం 6.30 గంటలకు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోపాటు ఇమామ్‌లు, మౌజన్లు, పెద్ద గురువులు, మత పెద్దలు ముతవలీలు మాత్రమే వేదికపైన ఉంటారని, మిగిలినవారికి మైదానంలో విందు ఏర్పాటు చేశామన్నారు. ఈవిందులో ఎటువంటి రాజకీయాలకు తావులేదన్నారు. సమావేశంలో నియోజక వర్గ పరిశీలకులు వహీద్ హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర

ధర్మవరం బీజేపీ అభ్యర్థిగా సత్యకుమార్



పుట్టపర్తి, మార్చి27(ఆంధ్రజ్యోతి): ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సత్యకుమార్‌ను ఆ పార్టీ అధిష్టానం బుధవారం ప్రకటించింది. పొత్తులో భాగంగా ఈ స్థానం బీజేపీకి కేటాయిస్తారని ప్రచారం జరిగినప్పటికీ అభ్యర్థి ఎవరన్న విషయంగా ఉత్కంఠ కొనసాగింది. సత్యకుమార్ విద్యార్థి దశ నుంచే ఏబీవీపీతో అనుబంధాన్ని పెంచుకున్నారు. విద్యా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశారు. అనంతరం బీజేపీ నాయకుడిగా ఎదిగి ఉమ్మడి ఏపీతో పాటు కర్ణాటక రాష్ట్రాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శిగా తన పనితీరుతో మంచి గుర్తింపును పొందారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో సత్యకుమార్‌కు 25 ఏళ్ల అనుబంధం ఉంది. సుదీర్ఘకాలం వెంకయ్యానాయుడుకు రాజకీయ వ్యవహారాలు, వ్యూహాల రూపకల్పనలో సత్యకుమార్ చేదోడుగా నిలిచారు. బీజేపీ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం అండమాన్ నికోబార్ ద్వీపాల ఇన్‌చార్జితోపాటు ఉత్తరప్రదేశ్ సహ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రొఫైల్

పేరు: సత్యకుమార్ యాదవ్

స్వగ్రామం: గడేకల్లు, విడపకల్లు మండలం, అనంతపురం జిల్లా. ప్రస్తుతం ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్నారు.

విద్యార్హత: ప్రొద్దుటూరు మున్సిపల్ పాఠశాల, నాగకర్నూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేశాడు. బళ్లారిలో పీయూసీ, మదనపల్లిలో డిప్లొమా, బెంగళూరులో ఇంజనీరింగ్ విద్య, మధురై కామరాజ్ యూనివర్సిటీ లో పొలిటికల్ సైన్స్ లో మాస్టర్ డిగ్రీ, చెన్నైలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశాడు. ప్రస్తుతం వెంకటేశ్వర యూనివర్సిటీలో లా కోర్సు అభ్యసిస్తున్నాడు.

మన వాళ్లు ఎవరబ్బా !

కుల సంఘాలతో ద్వితీయశ్రేణి నాయకుల ఆరా

వివరాల జాబితాలు అభ్యర్థులకు అందజేత

సంఖ్యను బట్టి తాయిలాలు రెడీ చేస్తున్న అభ్యర్థులు



హలో ఎంకన్నా.. నమస్తే. బాగున్నావా ? ఎట్లున్నారు మనవాళ్లు? అంతా మనవైపే ఉన్నారు కదా! అవును, మన కులంలో ఎంతమంది ఉంటారు? మన పల్లెలో మిగిలిన కులాలవారు కూడా ఎవరెవరు ఎంతమంది ఉన్నారో కొంచెం తెలుసుకుని చెప్పండి. ఇట్లా.. ప్రస్తుతం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వద్ద కీలకంగా పని చేస్తున్న నాయకులు సామాజిక వర్గాల వారిగా వివరాలు సేకరిస్తున్నారు.



హిందూపురం, మార్చి 27 : ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీల అభ్యర్థుల వద్ద ఉండే కీలక నాయకులు ఎవరి స్థాయిలో వారు ఓట్లు రాబట్టుకునేందుకు మార్గాలు అన్వేషిస్తున్నారు. గత మూడు నాలుగు రోజులుగా అధికార పార్టీ అభ్యర్థుల వద్ద ఉన్నవారు తమ కుల సంఘాల నాయకులకు ఫోన్‌లు చేస్తూ ఎవరు ఎటువైపో ఆరా తీస్తున్నారు. మొత్తం సమాచారం సేకరించి ముఖ్య నేతలకు నివేదిస్తున్నారు. ఇలా వచ్చిన సమాచారంతో ఓట్లు ఎలా రాబట్టుకోవాలో ఆయా పార్టీల అభ్యర్థులు అంచనాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎవరికి తాయిలాలు పంపిణీ చేయాలి, ఎప్పటి నుంచి ఇవ్వాలి, ఎవరితో పంపించాలనే లెక్కలు కూడా వేసుకుంటున్నారు.

ప్రధాన కులాలు వన్‌సైడే ?

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాన కులాలు హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో వన్‌సైడ్‌గా ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఐదేళ్లలో అధికార పార్టీ చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, దందా, భూ పంచాయితీలు దృష్టిలో పెట్టుకుని ప్రధాన సామాజికవర్గాలు అంతా ఒకవైపే ఓటేయాలని భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నా రు. ఇటీవల హిందూపురంలో ఓ సామాజిక వర్గం సమావేశమై మన మంతా ఫలానా పార్టీకే ఓటువేయాలని లేదంటే భవిష్యత్తులో మనం మరింత ఇబ్బంది పడాల్సి ఉంటుందని తీర్మానించారు. ఇలాంటి సామాజికవర్గాలు మరికొంతమంది కూడా సమావేశాలు ఏర్పాటు చేసుకుని రహస్యంగా చెప్పినట్లు సమాచారం.

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తలంపుతో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు తలమునకలయ్యారు. సామాజిక వర్గాలవారీగా కులసంఘాలను సమావేశ పరిచి ఆయా కులాల ఓటర్లను ఆరా తీస్తున్నారు. పల్లెల్లో, పట్టణంలో ఆయా కుటుంబాలవారు ఎక్కడెక్కడున్నారు ఎంత మంది ఉన్నారని లెక్కగడుతున్నారు. ఎంత మేర ఇవ్వాల్సి ఉంటుందని మొత్తం ఓటర్లకు ఎంత ఖర్చు అవుతుందని అంచనాలు వేస్తున్నారు. హిందూపురం నియోజకవర్గంలో కుల సంఘాల నాయకులను పిలిపించి మాట్లాడినట్లు సమాచారం.

ఓట్లు రాబట్టేందుకు అభ్యర్థుల అంచనాలు

సంఖ్యను బట్టి తాయిలాలు గ్రేడింగ్

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఓట్లు రాబట్టుకునేందుకు సామాజిక వర్గాల వారీగా సంఖ్యను బట్టి తాయిలాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని పార్టీలు కొంతమందికి తాయిలాలు ఇవ్వగా మిగిలినవారికి కూడా ఏరకంగా తాయిలాలు ఇవ్వాలోనని మల్లగుల్లాలు పడుతున్నారు. ఓటర్లవారిగానా లేక కుటుంబాలవారిగానా, అదిలేకుంటే సామాజికవర్గంగా కొన్ని అభివృద్ధి పనులకు తాయిలాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో అలాంటివి గుర్తించి అభ్యర్థులకు అందజేశారు.

కులాలవారీగా టీమ్‌ల ఏర్పాటుకు సిద్ధం



ఇదిలా ఉంటే కులాలవారీగా కొంత మంది ఆయా సామాజికవర్గానికి చెందిన యువకులను బృందాలుగా ఏర్పాటు చేస్తున్నారు. యువకులు బృందాలుగా మారి ఓటర్ల వద్దకు వెళ్లి ఏ పార్టీకి ఓటేస్తే ఎలా ఉంటుందనే దానిపై ఇప్పటికే ప్రచారం చేశారు. ముఖ్యంగా ఆయా కులాలకు గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల చిట్టాను వివరించినట్లు తెలిసింది. దీంతో పాటు రద్దయిన పథకాలు, ఇప్పుడిస్తున్న పథకాలు, వాటిమధ్య వ్యత్యాసం కూడా ఓటర్లకు తెలపాలని ఒక పార్టీ లిస్ట్ ఇచ్చినట్లు సమాచారం. దీనినిబట్టి ఆయా బృందాలు పల్లెల్లోకి వెళ్లి కులాల వారిగా అవగాహన కల్పించేందుకు సిద్ధం అవుతున్నాయి.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

రాజకీయ కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి

- తనిఖీలు ముమ్మరం చేయండి
- జిల్లా అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశం

పుట్టపర్తి, మార్చి 27: రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి సంబంధించి సభలు, సమావేశాలు నిర్వహించడానికి ముందస్తు అనుమతి తప్పని సరిగా తీసుకునేలా చూడాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా జిల్లాల అధికారులను ఆదేశించారు. ఆయన విజయవాడ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష జరిపారు. ఇక్కడి కలెక్టర్ అరుణ్ బాబు, ఇతర అధికారులు స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా సకాలంలో అందే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. తనిఖీలు ముమ్మరం చేయాలని, అలసత్వం ప్రదర్శించకుండా నిర్దేశించిన విధులను తూచా తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. తాత్కాలికంగా ఏర్పాటైన రాజకీయ పార్టీల కార్యాలయాల్లో చిన్న చిన్న బ్యానర్లు, జెండాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివరామిరెడ్డి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు (బుధ)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	38.0	24.0
కదిరి	37.0	23.0
ధర్మవరం	38.0	24.0
హిందూపురం	37.0	23.0
పెనుకొండ	37.0	23.0

దాడి చేసి.. బుజ్జగింపులు



బాధిత మహిళ వహిదా

కదిరి, మార్చి 27: మహిళ అని కూడా చూడకుండా చెప్పుతో కొట్టారు. ఈవ్యవహారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన వరకు వెళ్లింది. వివిధ చానళ్లలో ప్రసారం అయ్యింది. ఈఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. జరిగిన నష్టాన్ని నివారించేందుకు ఆ బాధిత మహిళను బుజ్జగించే పనిలో ఓ స్థానిక వైసీపీ నాయకుడు ఉన్నట్లు తెలిసింది. వివరాలు ఇలా..

తనకు తీరని అవమానం జరిగిందంటూ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ముస్లిం మహిళ వహిదా మంగళవారం నిరసన తెలిపారు. అక్కడికి వెళ్లిన మీడియాకు తనకు జరిగిన అన్యాయాన్ని, అవమానాన్ని వివరించారు. ఇది వివిధ చానళ్లలో ప్రసారమైంది. పోలీసులు వెంటనే ఆమెను స్టేషన్ లోపలికి తీసుకెళ్లారు. ఆమె తనకు జరిగిన అవమానాన్ని పోలీసులకు వివరించింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు. మంగళవారం రాత్రి వైసీపీ కదిరి అభ్యర్థి కూడా ఫోన్‌లో ఆమెకు క్షమాపణలు తెలిపి, రాజీకి రావాలని కోరినట్లు సమాచారం. దీనికి ఆమె సమ్మతించారు. అయితే ఇంతలోనే చెప్పుతో కొట్టిన వార్త అవాస్తవ మని ఓ మహిళ సంఘం లీడర్ సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లు బాధితురాలి బంధువులు తెలిపారు. దీంతో మరింత ఆవేదనతో బాధిత మహిళ ఆ గ్రూపు లీడర్ ఇంటి వద్దకు వెళ్లి నిలదీసినట్లు సమాచారం. ఇరు వర్గాల వారు వాదులాడుకొని తిరిగి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినట్లు తెలిసింది. కేసు నమోదు చేయాలని పోలీసులను కోరినట్లు సమాచారం. ఇరువురి మధ్య రాజీ కుదుర్చడానికి ఓ స్థానిక ప్రజాప్రతినిధి రంగంలోకి దిగినట్లు తెలిసింది. చివరకు వైసీపీ అభ్యర్థి మక్బూల్ అహమ్మద్ బాధిత మహిళ ఇంటికి వెళ్లి రాజీ ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అయితే బాధిత మహిళ మాత్రం తనను చెప్పుతో కొట్టిన నాయకుడు వచ్చి క్షమాపణ చెప్పాలని కోరినట్లు తెలిసింది. తన మొహం చూసైనా ఈ విషయాన్ని వదిలి వేయాలని మక్బూల్ కోరినట్లు సమాచారం. దీనికి బాధితురాలు సమ్మతించారు.

రాజీకి వైసీపీ అభ్యర్థి తంటాలు



ఫిర్యాదు చేయలేదు : పట్టణ సీఐ

తనను మాజీ కౌన్సిలర్ పరికి షామీర్ చెప్పుతో కొట్టాడని మీడియాకు చెప్పిన ముస్లిం మహిళ వహిదా పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు ఆమె బంధువులు తెలిపారు. అయితే పట్టణ సీఐ పుల్లయ్య మాత్రం తమకు ఆమె ఫిర్యాదు చేయలేదని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ సంఘటన గురించి పోలీసులకు తెలియలేదని చెప్పడం అశ్చర్యంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలిపింది. అతరువాత పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్లింది. తనకు జరిగిన అన్యాయాన్ని, అవమానాన్ని పోలీసులకు వివరించింది. అయినా ఫిర్యాదు చేయలేదని సీఐ చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆది నుంచి అరాచకమే

వైసీపీ నాయకులు తొలి నుంచి ఇలానే ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత వైసీపీ అభ్యర్థి మక్బూల్ అహమ్మద్ కూడా నంబులపూలకుంటకు చెందిన వైసీపీ నాయకుడు రంగారెడ్డిని ఫోన్‌లో బూతులు తిట్టినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కొత్తగా వచ్చిన వారికి టిక్కెట్లు ఇస్తే ఐదేళ్లు కష్టపడి పనిచేసిన వారి పరిస్థితి ఏమిటని రంగారెడ్డి వైసీపీ అధిష్టానాన్ని అప్పట్లో ప్రశ్నించినట్లు తెలిసింది. దీనికి ఆగ్రహించిన మక్బూల్ ఫోన్‌లో పత్రికల్లో రాయలేని విధంగా తిట్టిన తిట్లు వైరల్ అయ్యాయి. ఈ నెల 22న రాత్రి టీడీపీ నాయకుడు అయూబ్ ఖాన్ పై వైసీపీ నాయకులు విచక్షణారహితంగా దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారు. మంగళవారం కూడా ప్రచారం చేయడానికి కూలికి రమ్మని పలువురిని పిలిచారు. ఎక్కువమంది వచ్చారంటూ ముస్లిం మహిళపై మాజీ కౌన్సిలర్ పరికి షామీర్ చెప్పుతో దాడి చేసిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 గురువారం (సాయంత్రం)	4.57 శుక్రవారం (ఉదయం)
కదిరి	6.31 గురువారం (సాయంత్రం)	5.02 శుక్రవారం (ఉదయం)
ధర్మవరం	6.37 గురువారం (సాయంత్రం)	4.59 శుక్రవారం (ఉదయం)
హిందూపురం	6.35 గురువారం (సాయంత్రం)	5.03 శుక్రవారం (ఉదయం)
పెనుకొండ	6.33 గురువారం (సాయంత్రం)	5.01 శుక్రవారం (ఉదయం)

వైసీపీ అభ్యర్థి ప్రచారంలో వలంటీర్



ప్రచారంలో వలంటీర్ సాయినాథ్‌రెడ్డి (వృత్తంలో)

నార్పల, మార్చి 27: మండలంలోని సిద్దరాచెర్ల గ్రామంలో బుధవారం వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సిద్దరాచెర్ల గ్రామానికి చెందిన వలంటీర్ సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నాడు. వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుతో పాటు వలంటీర్ సాయినాథ్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశాడు.

వలంటీర్ తొలగింపు

ధర్మవరంరూరల్, మార్చి 27: రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని, ఆ ప్రచారానికి ప్రజలు తప్పక హాజరుకావాలని కనగానపల్లి మండలం దాదులూరు పంచాయతీ కుర్లపల్లికి చెందిన మహేశ్వర్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆహ్వానించాడు. స్థానికులు పంచాయతీ అధికారులకు దీనిపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు వలంటీర్ మహేశ్వర్‌రెడ్డిని విధుల నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

శింగనమల, మార్చి 27: మండలంలో లోలూరు వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఆర్వో శ్రీను వెన్నెల బుధవారం తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే తమకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్ తొలగింపు

డీ.హీరేహాళ్, మార్చి 27: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్న విద్యుత్‌శాఖలో షిఫ్ట్ ఆపరేటర్‌గా దాదాఖలందర్‌ను విధుల నుంచి తొలగించినట్లు విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీరెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా రాయదుర్గం నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యుత్‌శాఖలో తాత్కాలిక షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించే దాదాఖలందర్ ప్రచారంలో పాల్గొన్నాడు. ఈ విషయమై పలు పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై అధికారులు విచారించి, విధుల నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు.

టెన్త్ సోషల్ పరీక్షకు 2,203 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 27: జిల్లాలో పదో తరగతి సోషల్ పరీక్షకు మొత్తం 2,203 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం జిల్లాలో 142 కేం ద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 31,330 మందికిగాను 31,0 18 మంది, ప్రైవేట్ విద్యార్థులు 2,538 మందికిగాను 647 మంది హాజరయ్యారు.

తోపు మాటలు నీటి మూటలు..!

- రాప్తాడు ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం
- రోడ్ల నుంచి భవన నిర్మాణాల వరకు అంతే
- నిధులున్నా.. ఒత్తిళ్లతో ముందుకురాని కాంట్రాక్టర్లు
- హౌసింగ్‌లో చేతులెత్తేశాడు.. పీఆర్ పరంగా అదే దుస్థితి

ఎక్కడ చూసినా.... ఎప్పుడు సమావేశం పెట్టినా.. అది చేశాం.. ఇది చేశాం.. గత ప్రభుత్వాలు చేయనంతగా.. ఈ ఐదేళ్లలో మేమే పెద్దఎత్తున అభివృద్ధి చేశాం.. అంటూ రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి తోపు ప్రగల్భాలు పలుకుతారు. కానీ ఆ నియోజకవర్గంలోని క్షేత్ర స్థాయిలో ఈ ఐదేళ్లలో జరిగిన పని తీరు పరిశీలిస్తే.. ఆ ఎమ్మెల్యే చెప్పే మాటలకు.. చేతలకు ఏ మాత్రం పొంతన కనిపించదు. ఇటు పీఆర్ పనుల పరంగాను.. అటు హౌసింగ్ పనుల పరంగా.. ఎక్కడా చూసిన అంతే.. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

- అనంతపురం సిటీ

రాప్తాడు నియోజకవర్గ పరిధిలో ఈ ఐదేళ్లలో పరిస్థితి ఇలా...

- మంజూరు చేసిన సచివాలయాలు : 47
- పూర్తి అయిన సచివాలయాలు : 31
- నిర్మాణ దశలో ఉన్నవి : 10
- పూర్తిగా ఆపేసినవి : 06
- మంజూరు చేసిన రైతు భరోసా కేంద్రాలు : 35
- పూర్తి అయిన రైతు భరోసా కేంద్రాలు : 28
- నిర్మాణ దశలో ఉన్నవి : 04
- పూర్తిగా ఆపేసినవి : 03
- మంజూరు చేసిన వైఎస్‌ఆర్ హెల్త్‌క్లీనిక్ భవనాలు : 35
- పూర్తి అయిన భవనాలు : 18
- నిర్మాణ దశలో ఉన్నవి : 08
- పూర్తిగా ఆపేసినవి : 09

రాప్తాడులో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు

- మంజూరైన సీసీ రోడ్ల సంఖ్య : 31
- ఇప్పటికి పూర్తి అయిన రోడ్ల సంఖ్య : 13
- నిర్మాణ దశలలో ఉన్న రోడ్ల సంఖ్య : 18
- రోడ్లకు కేంద్రం నిధుల మంజూరు : రూ. 1.56 కోట్లు.
- ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు : 50.00 లక్షలు మాత్రమే
- ఇంకా పనులు చేయాల్సిన నిధులు : రూ. 1.06 కోట్లు

హౌసింగ్ ఇళ్ల పరంగా...

- రాప్తాడు ఎమ్మెల్యేకు చెందిన రాక్రీట్ సంస్థ ఐదేళ్లలో కట్టించే ఇళ్ల సంఖ్య : 7,671
- ఈ ఐదేళ్లలో కట్టించిన ఇళ్ల సంఖ్య : 350 మాత్రమే
- ఇంకా కట్టాల్సిన ఇళ్ల సంఖ్య : 7,321

● రోడ్ల నుంచి భవనాల వరకు అంతే...

జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల పరంగా ఎక్కడ చూసిన అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇటు పంచాయతీ రాజ్‌శాఖ పరంగా జరిగే సీసీ రోడ్ల నుంచి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్‌ఆర్ హెల్త్‌క్లీనిక్ భవనాల వరకు అభివృద్ధి పనులు ఏమాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. కొన్ని చోట్ల మరీ దారుణం. పునాదులకే పరిమితమయ్యాయి. కొన్ని రోడ్ల నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. ఇదిలా ఉండగా.. డిజటల్ లైబ్రరీల పరిస్తితి అయితే దయనీయంగా మారింది. రాప్తాడు నియోజకవర్గ పరిధిలో 59 డిజటల్ లైబ్రరీలు మంజూరు చేస్తే ఈ ఐదేళ్లలో ఒక్క దాన్ని కూడా నిర్మించలేదు.



ఆత్మకూరులో సీసీ రోడ్ల నిర్మాణ పనులు (ఫైల్)

ఎమ్మెల్యేకు చెందిన రాక్రీట్ సంస్థ చేపట్టిన జగనన్న లేఅవుట్ దుస్థితి



హౌసింగ్‌లోనూ చేతులెత్తేశాడు

వైసీపీ అధికారంలోకి రాగానే.. రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి తమ రాక్రీట్ సంస్థ ద్వారా ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలు, లబ్ధిదారులు చెల్లించే రూ.35 వేలు మొత్తంతో కలిపి జిల్లాలో 7,671 ఇళ్లను నిర్మించేలా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే ఈ ఐదేళ్లలో కేవలం 350 ఇళ్లను మాత్రమే కట్టించాడు. మిగిలిన 7,321 ఇళ్లు ఇప్పటికి నిర్మాణ దశలోనే ఉన్నాయి. వీటిలో 90 శాతం ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయి. ఇదే క్రమంలో నియోజకవర్గంలో పీఆర్ పనుల పరంగా సీసీ రోడ్లు, పలు ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులూ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన్ని తలపిస్తున్నాయి.

● కమీషన్లు ఇవ్వలేక..

కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబరులో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద జిల్లాకు 360 సీసీ రోడ్లకు రూ. 17.60 కోట్లు నిధులను కేటాయించింది. వీటిలో రాప్తాడు నియోజకవర్గ పరిధిలో 31 రోడ్లకు సంబంధించి రూ.1.56 కోట్ల నిధులను కేటాయించింది. అయితే ఈ పనుల పరంగా ఎక్కడా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదు. ఇప్పటికి ఈ పనులకు నిధులు మంజూరు చేసిన ఏడు నెలలు గడిచిన 31 రోడ్లలో కేవలం 13 రోడ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 18 రోడ్లు ఎప్పుడు పూర్తి అవుతాయో అర్థంకానీ దుస్థితి. పైగా ఈనెల 31వ తేదితో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ రోడ్లకు సంబంధించి అధికార పార్టీ వర్గీయుల నుంచి కమీషన్ ఇవ్వాలంటూ పలు రకాల ఒత్తిళ్లు రావడంతోనే.. నిధులున్నాప్పటికి చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఇదిలా ఉండగా... సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్‌ఆర్ హెల్త్‌క్లీనిక్‌ల పరంగా కూడా బిల్లుల జాప్యంతో పాటు కమీషన్ల ఒత్తిళ్లతో చాలా వరకు భవనాలు నిర్మాణాలు సాగలేదని తెలిసింది.

- నియోజవర్గానికి మంజూరైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ భవనాల సంఖ్య : 117
- పూర్తి అయిన భవనాల సంఖ్య : 77
- నిర్మాణ దశలో ఉన్న భవనాలు : 22
- పూర్తిగా ఆపేసినవి : 18
- రాప్తాడు పరిధిలో 59 డిజిటల్ లైబ్రరీలు మంజూరు చేస్తే.. ఒక్కటి కూడా నిర్మాణానికి నోచుకోలేదు.

ఆగేదెప్పుడు ?

- పెన్నా, చిత్రావతి నుంచి ఇసుక అక్రమ రవాణా
- మూన్నాళ్ల ముచ్చటగా పోలీసుల దాడులు
- టిప్పర్ల ధాటికి ఛిద్రమవుతున్న రహదారులు
- పలు గ్రామాల్లో అడ్డుకుంటున్న ప్రజలు
- నిద్రమత్తు వీడని అధికారులు

తాడిపత్రి టౌన్, మార్చి 27: ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు మూన్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. కొంతమంది అధికారుల అండతో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. పెన్నానది ప్రాంతంలో హిటాచీలతో ఇసుకను తోడేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆపార్టీ నాయకులకు ప్రధాన ఆదాయ వనరుగా ఇసుక మారింది. తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు ప్రాంతాల్లో పెన్నా నది, శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరులో చిత్రావతి నది ప్రవహిస్తున్నాయి. ఈ నదుల్లో ఇసుక నాణ్యతగా ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో ఇసుకాసురులు రాత్రిపగలు తేడా లేకుండా ఇసుకను హిటాచీలతో తోడి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు తరలిస్తున్నా రు. నదులలో ఇసుక తరిగిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతు న్నాయి.

అడ్డుకుంటున్న ప్రజలు

ఇసుక అక్రమ రవాణాను అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పలు గ్రామాల్లో ప్రజలే అడ్డుకుంటున్నారు. తాడిపత్రి మండలంలోని ఆలూరు వద్ద ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని టీడీపీకి చెందిన ఓ కీలకనేత, గ్రామస్థులు చెప్పడంతో కొన్నిరోజులు తాత్కాలికంగా అక్కడ తవ్వకాలు నిలిపివేశారు. అయితే రాత్రి సమయాల్లో పెద్దఎత్తున ఇసుకను తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక టిప్పర్ల అధిక టన్నేజీ వల్ల పలు గ్రామాల్లో రోడ్లు ఛిద్రం అవుతుండటంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయంటూ గతంలో గ్రామస్థులు వాహనాలను అడ్డుకున్నారు. నెలరోజుల కిందట పుట్లూరులో మహిళలు ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. యల్లనూరులో ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లను గ్రామస్థులే అడ్డుకోవడం పరిపాటిగా మారింది. పదిరోజుల కిందట పెద్దవడుగూరు మండలం కొండూరు గ్రామంలో అక్రమంగా తరలుతున్న ఇసుక టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు.



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

అడ్డదిడ్డంగా ఇసుక అక్రమ రవాణా

అధికారుల నిఘా కొరవడటంతో నియోజకవర్గంలో వైసీపీ నాయకులు రెచ్చిపోయి అడ్డదిడ్డంగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. తాడిపత్రి మండలంలోని గంగాదేవిపల్లి, చిన్నపొలమడ, వీరాపురం, సజ్జలదిన్నె, అక్కన్నపల్లి, ఆలూరు గ్రామాల వద్ద పెద్దఎత్తున టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతున్నా అటువైపు ఏ అధికారి కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్దపప్పూరు సమీపంలో పెన్నానది నుంచి పెద్దఎత్తున ఇసుక తరలింపు జరుగుతోంది. దీంతో నదిలో భారీగా గోతులు ఏర్పడ్డాయి. పెద్దవడుగూరు మండలంలోని చిట్టూరు, చిత్రచేడు, కొండూరు, నాగలాపురం నదీపరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలుతున్నా కట్టడిచేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పెద్దవడుగూరు నుంచి నంద్యాలజిల్లాకు ఇసుకను తరలించాలంటే యాడికి మండలంలోని రాయలచెరువు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కానీ యాడికి పోలీసులు దాడులు నిర్వహించి టిప్పర్లు, ట్రాక్టర్లను సీజ్ చేసిన సంఘటనలు చాలా తక్కు వగా ఉన్నాయి. పెద్దపప్పూరుతోపాటు గార్లదిన్నె, పసలూరు, నరసాపురం గ్రామాల్లోని నదీపరివాహక ప్రాంతాలను ఇసుకా సురులు టార్గెట్‌గా పెట్టుకొని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా పెద్దఎత్తున అక్రమ రవాణా చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు మండలంలోని మేడికుర్తి, తిరుమలాపురం చిత్రావతి నది నుంచి పెద్దఎత్తున ఇసుక తవ్వేస్తున్నారు.



ఆలూరు గ్రామ సమీపంలోని నదిలో యంత్రంతో ఇసుకను తోడుతున్న దృశ్యం (ఫైల్)

పత్తాలేని మైన్స్ అండ్ జియాలజీ అధికారులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పత్తా లేకుండా పోయారు. ఇసుక తవ్వకాలు చేయకూడదంటూ కోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక పోలీసులైతే తమకు ఎన్నికల విధులు ఉన్నాయంటూ నామమాత్రపు దాడులతో చేతులు దులుపుకుంటున్నారు. ఇరుశాఖల అధికారుల దాడులు లేకపోవడంతో ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుకను తరలించేస్తున్నారు.



పెద్దవడుగూరు మండలం కొండూరు గ్రామంలో ఇసుక టిప్పర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్థులు (ఫైల్)

30 నుంచి దివ్యాంగ పిల్లలకు అసెస్‌మెంట్ క్యాంప్

కొత్తచెరువు, మార్చి 27: శ్రీసత్యసాయి జిల్లాలోని ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలలోని దివ్యాంగ పిల్లలకు అసెస్‌మెంట్ క్యాంప్‌లను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న ధర్మవరంలోని ఎల్‌సీకే పురంలో గల భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంపులో ధర్మవరంతో పాటు బత్తలపల్లి, తాడిమర్రి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలకు చెందిన దివ్యాంగ పిల్లలు హాజరు కావాలన్నారు. ఏప్రిల్ 1న కదిరి భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంప్‌నకు కదిరితోపాటు ఓడీసీ, ఎన్‌పీకుంట, నల్లచెరువు, గాండ్లపెంట, తనకల్లు, తలుపుల, అమడగూరు మండలాలకు చెందిన దివ్యాంగపిల్లలు హాజరు కావాలన్నారు. ఏప్రిల్ 2న హిందూపురంలోని భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంప్‌నకు లేపాక్షి, చిలమత్తూరు, పెనుకొండ, సోమందేపల్లి, పరిగి మండలాల దివ్యాంగ పిల్లలు హాజరుకావాలన్నారు. 3న మడకశిరలోని భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంపునకు అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం, రొ ద్దం మండలం పిల్లలు హాజరు కావాలన్నారు. 4న పుట్టపర్తిలోని భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంప్‌నకు గోరంట్ల, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, పుట్టపర్తి, ముదిగుబ్బ మండలాలకు చెందిన దివ్యాంగ పిల్లలు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 27: ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్ పంపిణీ మూడు రోజులు ఆలస్యం పంపిణీ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీన బ్యాంకులు పనిచేయని కారణంగా... ఏప్రిల్ 1న పంపిణీ చేయాల్సిన సామాజిక భద్రత పింఛన్లు మూడో తేదీ నుంచి పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామ-వార్డు వలంటీర్లు పింఛన్ పంపిణీలో ఎటువంటి ప్రచారం, ఫొటోల ప్రదర్శన, ఆర్భాటాలు చేయరాదని సూచించారు. పింఛన్ పంపిణీలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు, మార్చి 27: 2024-25వ విద్యా సంవత్సరానికి గాను శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న 10 ఆదర్శపాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో చదివి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో https://apms. apcfs s.inతో పాటు https://cse.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఈనెల 25 నుంచి మే 22వతేదీ వరకు నెట్‌బ్యాంకింగ్,క్రిడిట్,డెబిట్ కార్డులు ఉపయోగించి గేట్ వే ద్వారా అప్లికేషన్ రుసుం చెల్లించాలన్నారు. ఆ తరువాత వారికి ఒక జనరల్ నెంబర్ కేటాయిస్తామన్నారు. ఆ నెంబరు ఆధారంగా వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.200, ఎస్సీ,ఎస్టీలకు రూ.150 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. 10వతరగతిలో మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం ఆదర్శపాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉప విద్యాశాఖ అధికారులను, మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

రేపు రాయలసీమ చిత్రలేఖనాల ప్రదర్శన

అనంతపురం కల్చరల్, మార్చి 27: రాయలసీమ ప్రాంత సంస్కృతి, సమాజ స్థితిగతులపై ఇటీవల నిర్వహించిన పోటీలకు వచ్చిన చిత్రలేఖనాలను శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలోని వేమన ఫౌండేషన్ కేంద్రంలో ప్రదర్శించనున్నారు. ఈమేరకు వేమన ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనలో దాదాపు వందకు పైగా చిత్రలేఖనాలను ప్రదర్శిస్తామన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్, మార్చి 27: పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయ చంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 4న జరిగే పాలిసెట్ పరీక్షలకు జిల్లాలోని అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, నా ర్పల, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 94905 41633, 95029 76961 ఫోన్ నెంబర్లకు గాని, సమీప ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను గాని సంప్రదించాలని సూచించారు.

అంజలి మృతి కేసులో ముగ్గురి అరెస్టు

భర్త తీవ్రంగా కొట్టడంతోనే మృతి: డీఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 27: గర్భిణి అంజలి అనుమానాస్పద మృతి కేసులో ఆమె భర్త రాజు, బేల్దారులు దస్తగిరి, బాలుని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కేసు వివరాలను వన్‌టౌన్ సీఐ రెడ్డప్పతో కలిసి డీఎస్పీ వీరరాఘవరెడ్డి వెల్లడించారు. అంజలి మృతి కేసును సీరియస్‌గా తీసుకున్నామని, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి అంజలి బిడ్డలను, అత్త తులశమ్మను విచారించామని తెలిపారు. ఈ నెల 23న అంజలిని బాలు, దస్తగిరి ఇంటి నుంచి ఆటోలో తీసుకెళ్లారని, కొన్ని గంటల తరువాత ఇంట్లో వదిలివెళ్లారని తెలిపారు. ఈ విషయంలో అంజలి, ఆమె భర్త రాజు మధ్య ఆ రాత్రి గొడవ జరిగిందని, ఎక్కడెక్కడో తిరుగుతూ పిల్లలను పట్టించుకోవడం లేదని భార్యను రాజు నిలదీశాడని తెలిపారు. దీంతో నిత్యం మద్యం తాగుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నావని అంజలి ఎదురు తిరిగిందని, ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ తీవ్రమై.. అంజలిని భర్త తీవ్రంగా కొట్టాడని తెలిపారు. భర్త కొట్టడంతో ఆమెకు గాయాలైనట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, ఆ తరువాత కొంతసేపటికి అంజలి మృతి చెందిందని వివరించారు. అంజలి ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకుని, ఆమెను బేల్దార్లు దస్తగిరి, బాలు నమ్మించి శారీరకంగా వాడుకున్నారని తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శివరామిరెడ్డి సమక్షంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో మహిళా వైద్యుల బృందం ఖననం చేసిన అంజలి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిందని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి

వివాహేతర సంబంధంతోనే హత్య

- శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి
- అమరనాథ్ రెడ్డి హత్య కేసులో నలుగురి అరెస్టు

పుట్టపర్తి రూరల్, మార్చి 27: నల్లమాడ మండలం కుటాలపల్లి గ్రామానికి చెందిన అమరనాథ్‌రెడ్డి హత్యకు వివాహేతర సంబంధమే కారణమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ వాసుదేవన్‌తో కలిసి బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన మేరకు, కుటాలపల్లికి చెందిన దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి కుటాలపల్లి తండాకి చెందిన రమావత్ తిప్పేబాయితో పదిహేనేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. మూడు నెలల నుంచి దుద్దుకుంట అమరనాథ్‌రెడ్డి కూడా అదే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో దుద్దుకుంట శ్రీనివాసరెడ్డిని తిప్పేబాయి దూరం పెట్టింది. అమరనాథ్‌రెడ్డి తన కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశాడని, ప్రతినెలా తన అవసరాలు తీరుస్తున్నాడని శ్రీనివాసరెడ్డితో చెప్పింది. అమరనాథ్ రెడ్డిని వదిలేయాలంటే అతనికి రూ.లక్ష ఇచ్చేయాలని సూచించింది. తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని, డబ్బులు ఇవ్వలేనని శ్రీనివాసరెడ్డి ఆమెతో అన్నాడు. అట్లయితే అమరనాథ్ రెడ్డిని చంపేయాలని, అప్పుడు కలిసి ఉండొచ్చని తిప్పేబాయి చెప్పడంతో శ్రీనివాసరెడ్డి సమ్మతించాడు. తన బంధువు గుండ్ర వీరారెడ్డి, చౌటకుంటపల్లి గ్రామానికి చెందిన మల్లెల వినోద్‌కుమార్ అలియాస్ కర్ణ సాయంతో అమరనాథ్ రెడ్డిని చంపాలని పథకం వేసుకున్నాడు. ఈ నెల 24వ తేదీన నల్లమాడలో ఇద్దరికీ మద్యం తాపించి, తన బైక్‌పై అమరనాథ్ రెడ్డి పొలం వద్దకు వెళ్లారు. అక్కడ నిద్రిస్తున్న అమరనాథ్ రెడ్డిని తమతో తీసుకెళ్ళిన మల్బరీ ఆకు కత్తిరించే కత్తితో విచక్షణారహితంగా నరికి చంపారు. ఈ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని, బైకును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. హత్య కేసును ఛేదించిన పుట్టపర్తి డీఎస్పీ నేతృత్వంలోని నల్లమాడ సీఐ రాజేంద్రనాథయాదవ్, పుట్టపర్తి రూరల్ సీఐ రాగిరిరామయ్య, సోసియల్ మీడియా ఇన్స్‌పెక్టర్ హేమంత్‌కుమార్, నల్లమాడ ఎస్ఐ రమేష్‌బాబు బృందాన్ని ఆయన అభినందించారు.



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ మాధవ రెడ్డి


టీడీపీలో చేరినవారితో కందికుంట

తెలుగుదేశంలోకి భారీగా చేరికలు

తనకల్లు, మార్చి 27: మండలంలోని కొక్కంటిక్రాస్, తిరుమలయ్యగారిపల్లి, వేపలపల్లి, దేవలంతండా తదితర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు బుధవారం టీడీపీలోకి చేరారు. పట్టణంలోని పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో.. ఆయన సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు కప్పి పార్టీలోకి కందికుంట ఆహ్వానించారు. తిరుమలయ్యగారిపల్లికి చెందిన మొండెం వెంకటరెడ్డి, కమతంపల్లి సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, గజేంద్రనాయక్, ధనలక్ష్మి, అజీద్‌నాయక్‌తో పాటు 15కుటుంబాల వారు చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, కోటపల్లి సింగ్ విండో మాజీ అధ్యక్షుడు బాగేపల్లి చలపతి, నియోజకవర్గ పరిశీలకుడు వాహిద్, పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తవళం పంచాయతీలోని గందోడివారిపల్లి, పింజిరివాండ్లపల్లి గ్రామాలనుంచి దాదాపు 30కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో నాయకులు మల్లిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణ, దళిత సత్యనారాయణ, చారుపల్లి క్రిష్టారెడ్డి, మాధవరెడ్డి, చెన్నక్రిష్ణ, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతబజారులో భవిష్యత్తు గ్యారెంటీ


కరపత్రాలను పంచుతున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, మార్చి 27: మండలకేంద్రంలోని పాత బజారులో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో పథకాల గురించి కరపత్రాలను పంచుతూ వివరించారు. ఈ పథకాలు కుటుంబంలో ఎవరెవరికి వర్తిస్తాయి. వీటి వల్ల ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, మైలే చిన్న శంకర్, ఈశ్వరయ్య, రమణమ్మ, రమీజా, రత్నమ్మ, ఆదిలక్ష్మీ, మౌలాలి, సాయికుమార్, నసీమా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

తనకల్లు, మార్చి 27: మండలంలోని చిన్ననారప్పగారిపల్లిలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, పరిష్కరించాలని ఆ గ్రామస్థులు బుధవారం పంచాయతీ కార్యదర్శి కేఎం రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ .. గ్రామంలో గత నెలరోజుల నుంచి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికే పలుమార్లు సర్పంచ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఫలితం లేకపోయిందని వాపోయారు. సమస్య వెంటనే పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. విషయాన్ని ఈఓఆర్‌డీ ఆనందయ్య దృష్టికి కూడా తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సమస్య పరిష్కరించాలని సర్పంచ్‌కు, సిబ్బందికి ఆదేశించారు.

ప్రశాంత ఎన్నికకు ప్రజలు సహకరించాలి: సీఐ


కవాతు నిర్వహిస్తున్న, పోలీసులు, బీఎస్‌ఎఫ్ సిబ్బంది

బుక్కపట్నం, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా జరగడానికి ప్రజలు సహకరించాలని పుట్టపర్తి రూరల్ సీఐ రాగిరి రామయ్య తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం బీఎస్‌ఎఫ్, సివిల్ ఫోర్సు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలు ఎటువంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్‌పై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఎస్సై అనిల్‌కుమార్, పుట్టపర్తి రూరల్, కొత్తచెరువు సీఐలు రాగిరి రామయ్య, రాజారమేష్, బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐలు సురేష్‌బాబు, కృష్ణమూర్తి, ఏఎస్‌ఐ రమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వైసీపీ కార్యక్రమాల్లో వలంటీర్లా?


వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్న వలంటీర్లు

గాండ్లపెంట, మార్చి 27: వైసీపీ కార్యక్రమాలకు వలంటీర్లు పాల్గొనవచ్చా అని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కదిరి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో గత మంగళవారం మండల స్థాయి పదవులు పొం దిన వారిని ఎమ్మెల్యే అభ్యర్థి మగ్బుల్ అహమ్మద్ సత్కరించారు. కార్యక్రమంలో వలంటీర్లు నటరాజ్, ఆజాద్ పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వలంటీర్లు పాల్గొనడం ఏమిటని టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, అక్రమ్ బాషా టీడీపీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఈ విషయం ఎంపీడీఓకు తెలుపుతామనివారు తెలిపారు.

అత్తారింటి వేధింపులకు మహిళ బలి

హిందూపురం అర్బన్, మార్చి 27: పట్టణంలోని సూరప్పకట్ట వద్ద ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో నివాసముంటున్న ఓ మహిళ అత్తా, మామ, భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ కన్జక్షన్ తెలిపారు. డీఎస్పీ తెలిపిన మేరకు వివరా లిలా ఉన్నాయి. అమడగూరు మండలం చిన్నగానపల్లికి చెందిన శివయ్య, సుజాత పెద్ద కుమార్తె సింధు(22). ఆమెను నాలుగేళ్ల కిందట హిందూపురంలోని కల్లూరు సుబ్బారావు పార్కు ఎదురుగా ఉన్న అయ్యప్ప దేవాలయ నిర్వాహకుడు బాలాజీ, నిర్మల దంపతుల రెండో కుమా రుడు రేణుకు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే తరచు అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధించే వారని సింధు తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో ఆమె బుధవారం ఉదయం విస ద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె వాంతులు చేసుకుంటుండగా ఇరుగుపొరుగువారు గమనించి దుకాణంలో ఉన్న అత్తా మామలకు సమాచారం అందించారు. వారు వచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం: కలెక్టర్


ఈవీఎంలను భద్రపరచిన గోదాముల వద్ద కలెక్టర్ తదితరులు

ధర్మవరం, మార్చి 27: సార్వత్రిక ఎన్నికలను ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం చట్టరీత్యా.. సజావుగా నిర్వహిస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో గల ఈవీఎంలను భద్రపరచిన గోదాములను బుధవారం సాయంత్రం ఆయన రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. గోదాములను తెరిపించి ఈవీఎం, కంట్రోల్ యూనిట్, ఈవీ ప్యాట్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈవీఎం గోదామును పటిష్టంగా, భద్రంగా ఉండేటట్టు అధికారులు అనునిత్యం తనిఖీలు నిర్వహించాలన్నారు. తాము ప్రతి మూడునెలలకొకసారి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటు హక్కు నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు సమయం ఉందన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేవిధంగా చూడాలని ఆయన అధికారులకు తెలియజేశారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఆయన వెంట ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ రమేశ్, మున్సిపల్ కమిషనర్‌రాంకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి


వెంకటరమణ(ఫైల్)

ముదిగుబ్బ, మార్చి27: మండల కేంద్రంలోని పాతూరికి చెందిన టీడీపీ కార్యకర్త బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వారి వివరాల మేరకు పాతూరికి చెందిన బాల వెంకటరమణ(35) అలియాస్ సన్నాకు బుధవారం తెల్లవారుజామున ఛాతిలో తీవ్రమైన నొప్పి వచ్చింది. ఆ తర్వాత ఇంట్లోనే కుప్పకూలాడు. కుటుంబసభ్యులు వచ్చి చూడగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ మండల నాయకుడు కోట్లబాబీ, కాంగ్రెస్ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, ఇతర నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సోమాలవాండ్లపల్లిలో వ్యక్తి హత్య


పాపయ్య (ఫైల్)

కదిరి, మార్చి 27: కుటుంబ సభ్యుల గురించి అసభ్యంగా చెబుతున్నాడని వ్యక్తి హత్య జరిగిన సంఘటన తలుపుల మండలంలోని సోమాలవాండ్లపల్లిలో మంగళవారంరాత్రి చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తలుపుల మండలం సోమాలవాండ్లపల్లికి చెందిన వెంకటకొండయ్యనాయుడు తన కుమార్తెను అదే గ్రామానికి చెందిన నారాయణస్వామికి ఇచ్చి రెండో వివాహం చేశాడు. అయితే నారాయణ స్వామి తమ్ముడు పాపయ్య(48) తన అన్న కుటుంబం గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తుండేవాడు. దీంతో వెంకటకొండయ్య పాపయ్యను మందలిస్తుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటలకు మద్యం మత్తులో ఇద్దరూ గొడవపడ్డారు. వెంకటకొండయ్య పాపయ్య తలకు రాయితో బలంగా కొట్టాడు. గ్రామస్థులు కలగజేసుకుని సర్ది చెప్పి వారిని ఇళ్లకు పంపారు. అయితే తిరిగి 11గంటల సమయంలో వెంకటకొండయ్య పాపయ్య ఇంటి సమీపానికి వచ్చాడు. అదే సమయంలో పాపయ్యకూడా తన సెల్‌ఫోన్ కనిపించలేదని బయటకు వచ్చాడు. ఈ క్రమంలో ఒకరినొకరు ఎదురుపడడంతో ఇద్దరూ మళ్లీ గొడవపడ్డారు. వెంకటకొండయ్య కట్టెతో కొట్టగా.. పాపయ్య కింద పడిపోయాడు. ఆ తర్వాత వెంకటకొండయ్య రాయితో పాపయ్య ముఖం, తలపై బాదాడు. దీంతో పాపయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే ఎస్‌ఐ దిలీప్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు వెంకటకొండయ్య పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

అభయాంజనేయుడికి మండల పూజ

హిందూపురం అర్బన్ మార్చి 27: స్థానిక దండు రోడ్డులో ఇటీవల 27 అడుగుల ఏకశిలా విగ్రహం ఏర్పాటు చేసి మండల కాలం పూర్త యింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో బుధవారం మండలపూజలో భాగంగా కలశారాధన, హోమాలు నిర్వహించారు. అనంతరం క్రేన్ సాయంతో భారీ ఆంజనే యస్వామి విగ్రహానికి అభిషేకాలు చేశారు. సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాల కు ప్రత్యేక పూజలు చేశారు. రామనామస్మరణ, ఆంజనేయ దండకం తో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణస్వామి, చౌడేష్, ప్రభాకర్, వెంకటేష్, ప్రియాగంగాధర్, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి : ఎమ్మార్పీఎస్

కదిరిఅర్బన్, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణమాదిగ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. వైసీపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తతామన్నారు. సమావేశంలో అంజనేయులు, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య


సృజన(ఫైల్)

బత్తలపల్లి, మార్చి 27: మండలకేంద్రంలోని వడ్డే వీధిలో మంగళవారం సాయంత్రం ఓ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లికి చెందిన తిరుపాలు, లలితమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సృజన (15) సంతానం. సృజన స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈమె గత రెండు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. బుధవారం చివరి పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. కాగా ఇంటిలో ఎవరూ లేనిది చూసి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. సాయంత్రం పక్కింటి మహిళ వారి ఇంటికి వెళ్లగా.. విద్యార్థిని ఉరికి వేళాడుతూ కనిపించింది. వెంటనే ఆమె స్థానికులకు, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. వెంటనే వారు వచ్చి విద్యార్థిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తమ కుమార్తె కడుపునొప్పి తాళలేకనే మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


నాగిరెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్, మార్చి 27: హిందూపురం రోడ్డు గట్టు వద్ద బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వరిగిరెడ్డిపల్లికి చెందిన నాగిరెడ్డి (68) తాగునీటికోసం బైక్‌లో వాటర్ క్యాన్‌తో గట్టు వద్ద ఉన్న వాటర్ ప్లాటుకు వచ్చాడు. నీరు పట్టుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో కదిరి నుంచి హిందూపురం వెళ్లే గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొంది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు. మృతుడికి భార్య రాధమ్మ, ఇద్దరు కుమారైలు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

బత్తలపల్లి, మార్చి27: మండలంలోని ముష్టూరు గ్రామంలో ఓబిరెడ్డికి చెందిన వ్యవసాయ తోటలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగలు మంగళవారం రాత్రి ధ్వంసం చేసి.. అందులోని కాపర్ వైరును చోరీ చేశారు. రైతు బుధవారం ఉదయం తోటవద్దకు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై.. కాపర్ చోరీ అయిన విషయాన్ని గుర్తించాడు. వెంటనే ఆయన ట్రాన్స్‌కో ఏఈ శివయ్యకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న ఏఈ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

31న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, మార్చి 27: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్‌అధ్యక్షుడు గూడూరుమోహన్‌దాసు, కార్యదర్శిరాజగోపాల్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం స్థానిక బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో జరుగుతుందన్నారు. ఇందులో కంటి సమస్యలున్న వారికి వైద్యనిపుణులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు పిట్టావెంకటస్వామి హాజరవుతారన్నారు. కంటిసమస్య ఉన్న వారు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

నల్లచెరువు, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కదిరిలో జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలకన్వీనర్ రాజశేఖర్, మాజీఎంపీపీ మాబూసాబ్ పిలుపునిచ్చారు. చంద్రబాబునాయుడు రోడ్ షో, ప్రజాగళ సభ జరగనున్నాయన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

గాండ్లపెంట: కదిరిలో గురువారం జరిగే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండలకన్వీనర్ కొండయ్య కోరారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ శివప్పనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, మాజీ సర్పంచ్ కాకర్ల రవీంద్రారెడ్డి, అక్రమ్, చంద్ర, మునాఫ్ యూనస్, నాయకులు పాల్గొన్నారు.

'ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యువల్ చేయాలి'


సేవ్ ఆర్డీటీ ప్లకార్డులతో కులసంఘాలు, ప్రజాసంఘాల నాయకులు

పెనుకొండ, మార్చి 27 : కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్డీటీకి విదేశాల నుంచి నిధులు వచ్చేందుకు ఎఫ్‌సీఆర్‌ఏను ప్రభుత్వం వెంటనే రెన్యువల్ చేయాలని అంతర్జాతీయ మానవహక్కుల పౌరమండలి జిల్లా అధ్యక్షుడు సమీవుల్లా కోరారు. స్థానిక ఎన్‌క్యూప గ్లోబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పౌరమండలి సభ్యులు, ప్రజాసంఘాలు, కులసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కోసం పాటు పడుతున్న ఆర్డీటీని కాపాడుకునేందుకు రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ముందుకు రావాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, పెద్దన్న, కౌన్సిలర్ శేషాద్రి, నరసింహులు, గంగన్న, ఐహెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, బాబావలి, ఖాన్‌బాష, మురళినాయక్, డిష్ ఆది శేషయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బండి మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌జే రత్నాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లె కుటుంబసభ్యులు

రత్నాకర్‌ను కలిసిన ' పల్లె 'కుటుంబసభ్యులు

పుట్టపర్తి, మార్చి 27: మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి తనకుటుంబసభ్యులతో కలిసి సత్యసాయిసెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌ను బుధవారం కలిశారు. పల్లె తన కోడలు, టీడీపీ అభ్యర్థి పల్లెసింధూరారెడ్డి, కుమారుడు పల్లెవెంకటకృష్ణకిశోర్‌రెడ్డిని వెంట పెట్టుకుని పట్టణంలోని రత్నాకర్ నివాసానికి వెళ్లి ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారికి రత్నాకర్ సాదర స్వాగతం పలికారు. టీడీపీ పల్లె సింధూరారెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో తాము రత్నాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్టు పల్లె తెలిపారు.

నేడు మసకవంకపల్లిలో పల్లె సింధూర ప్రచారం

నల్లమాడ, మార్చి 27: మండలంలోని మసకవంకపల్లి, కురుమాల గ్రామాల్లో గురువారం టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, ఆమె భర్త పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. ఈకార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

సోషియల్ పరీక్షకు 836 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 27: జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన సోషియల్ పరీక్షకు 836 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీఈఓ మీనాక్షి తెలిపారు. 115 కేంద్రాలలో 22,658 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 21,822 మంది హాజరయ్యారన్నారు. 836 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. దీంతో 96 మేర హాజరు శాతం నమోదైందని ఆమె తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

ముదిగుబ్బ: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పదవతరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా 3 పరీక్ష కేంద్రాలలో 726 మంది విద్యార్థులకుగాను చివరి రోజు సోషియల్ పరీక్షకు 698 మంది హాజరయ్యారని, 28 మంది గైర్హాజరయ్యారని ఎక్సామ్ చీఫ్ అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీఐ యతీంద్ర బందోబస్తు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి: తహసీల్దార్


పోలింగ్ కేంద్రాలపై సమీక్షిస్తున్న తహసీల్దార్

తనకల్లు, మార్చి 27: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్, నీడ తదితర సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ శోభాసువర్ణమ్మ అధికారులను సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె రూట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏయే పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలున్నాయో అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రూట్ అధికారులు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

పీవీఎస్ పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ


సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న వేద పండితులు

ముదిగుబ్బ, మార్చి27: మండల కేంద్రంలోని పీవీఎస్ పాఠశాలలో బుధవారం సరస్వతీదేవి, వినాయకుల విగ్రహాల ప్రతిష్ఠను వేదపండితులు రఘునాథశాస్త్రి, భరత్‌శాస్త్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పీవీనాయుడు మాట్లాడుతూ.... సకల విద్యలకు మూలమైన సరస్వతీదేవి, విఘ్నాధిపతి వినాయకుడి విగ్రహాలను పాఠశాల ఆవరణలో ప్రతిష్ఠించామన్నారు. ఆధునిక యుగంలో పిల్లల్లో భక్తి భావం పెంపొందించడానికి విగ్రహాలను ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ సుచిత్ర, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యకుమార్‌కు టిక్కెట్‌పై టీడీపీ నాయకుల హర్షం


ధర్మవరంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, మార్చి 27: ధర్మవరం అసెంబ్లీ టిక్కెట్‌ను బీజేపీకి చెందిన సత్యకుమార్ యాదవ్‌కు ఇవ్వడంతో పట్టణంలో టీడీపీ నాయకు లు బుధవారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు వార్డుల్లో కేకులు కట్ చేసి బా ణా సంచా కాల్చారు. సత్యకుమార్‌యాదవ్ విజయానికి తామంతా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, తలారిచంద్రమోహన్‌బాబు, బొట్టుకిష్ట, రాంపురంశీన, కత్తులబాబ్జీ, అడ్రామహేశ్, షామీర్, తోట నారాయణస్వామి, ఓంకార్, అమరా సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

ఏపీ ప్రాబబుల్స్ జట్లకు ఎంపిక


ఎంపికైన బాలబాలికలతో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం, మార్చి 27: జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర ప్రదేశ్ ప్రాబబుల్స్ జట్లకు ధర్మవరానికి చెందిన బాలబాలికలు ఎంపికైనట్టు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో ఈనెల 28వతేదీ నుంచి ఏప్రిల్7వ తేదీ వరకు జరిగే కోచింగ్ క్యాంప్‌నకు ధర్మవరానికి చెందిన సల్మా, కిరణ్మయి, విజయ్‌లు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. వారు ఏప్రిల్ 9 నుంచి 15వతేదీ వరకు పాండిచ్చేరిలో రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియంలో జరిగే 38వ యూత్ నేషనల్ బాస్కెట్ బాల్ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన బాలబాలికలను ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీతోపాటు అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు ఇదయతుల్లా, కోచ్‌సంజయ్ అభినందించారు.

నేడు సోమఘట్ట నృసింహస్వామి రథోత్సవం



అలంకరణలో మరుగేరి లక్ష్మీనృసింహస్వామి

చిలమత్తూరు, మార్చి 27: మండలంలోని సోమఘట్ట మరుగేరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మరథోత్సవాన్ని గురువారం మధ్యాహ్నం 1 గంటకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 7 గంటలకు స్వామి గిరి ప్రదక్షిణ, 8.30కు విష్వక్సేన పూజ, హోమాలు, మహా పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు రథోత్సవం ఉంటుందన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ఆర్‌జేడీ రాఘవరెడ్డి

లేపాక్షి, మార్చి 27: పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని విద్యాశాఖ ఆర్‌జేడీ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎటువంటి ఇబ్బందులు లేవని ఆయన తెలిపారు. స్థానిక ఓరియంటల్ పాఠశాలలో శనివారం ఐఎఫ్‌పీ ప్యానెల్‌ను పగలకొట్టడంపై విచారణ జరిపామన్నారు. ధ్వంసం చేసిన విద్యార్థిని గుర్తించామన్నారు. నూతన ఐఎఫ్‌పీ ప్యానెల్ కొనుగోలు కోసం ఆతడి తండ్రి వద్ద నుంచి రూ.130లక్షలు వసూలు చేశామని తెలిపారు. విద్యార్థులు మరోసారి ఇలాంటి పనులు చేయకుండా ఉండాలంటే ఇలాంటి శిక్షలు తప్పవన్నారు. అనంతరం విద్యార్థులు ఓపెన్ స్కూల్‌వైపు మొగ్గు చూపుతున్నారని అందుకే ఉత్తీర్ణతశాతం తగ్గిందని తెలిపారు. ఆయన వెంట డీఈఓ మీనాక్షి, ఎంఈఓ నాగరాజు నాయక్ తదితరులు ఉన్నారు.

45 మంది గైర్హాజరు

గోరంట్ల, మార్చి 27: పట్టణంలోని ఆరు కేంద్రాల్లో జరుగుతున్న పది పరీక్షకు బుధవారం 45మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాధికారులు తెలిపారు. మండలంలోని 1118మంది విద్యార్థులకు గాను 1073 మంది సోషియల్ పరీక్ష రాశారు. శ్రీవివేకానంద పాఠశాలలో ఏనిమిదిమంది, శ్రీవిజ్ఞాన ఏ- సెంటర్‌లో తొమ్మిది మంది, బీ - సెంటర్‌లో ఐదుగురు, న్యూ మాంటిస్సోరీలో 15 మంది, బాలుర ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా గురువారం వివేకానంద, ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలల్లోని మూడు కేంద్రాల్లో సంస్కృతం పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో పదో తరగతి పరీక్షలు ముగియనున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠశాలకు సాహిత్య పుస్తకాలు

గోరంట్ల, మార్చి 27: మండలంలోని కొండాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు తాటిమేకలపల్లికి చెందిన నరెడ్డుల రాజారెడ్డి అనే వ్యక్తి బుధవారం ఉచితంగా సాహిత్య పుస్తకాలను అందించారు. పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే వంద పుస్తకాలను ఆయన ఇచ్చినట్లు ఉపాధ్యాయుడు సుదాకర్‌రెడ్డి తెలిపారు. రచయితగా రాజారెడ్డి సాహిత్యం కోసం చేసిన సేవను కొనియాడారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సత్యవాణి ఆధ్వర్యంలో రాజారెడ్డిని, శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, గీతా, శ్రీకర, నందిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి భార్యావియోగం

పెనుకొండ, మార్చి 27: మండల మాజీ అధ్యక్షుడు నాగలూరు నారాయణస్వామి సతీమణి నాగమ్మ(55) బుధవారం మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురై బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఆమె మృతిపట్ల టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, టీడీపీ నాయకులు శేకవయ్య, మునిమడుగు వెంకటరాముడు, జేసీపీ నాయుడు, మాధవనాయుడు, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. స్వగామమైన నాగలూరులో గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

గోరంట్ల, మార్చి 27: పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు ఉజులుల్లా తండ్రి రహంతుల్లా అనారోగ్యంతో ఉండగా, టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి బుధవారం పరామర్శించారు. ఉజులుల్లా ఇంటికి వెళ్లి రహంతుల్లాను పరామర్శించారు. ఆయన అనారోగ్య విషయం తెలుసుకున్నారు. ఆయనతోపాటు సాయి కల్యాణ్, కొత్తపల్లి నరసింహప్ప, అశ్వర్థరెడ్డి, బెల్లా చెరువు చంద్ర, ఉమర్‌ఖాన్, ఫిరోజ్ బాషా, గిరిధర్‌గౌడ్, మనోహర్, మూర్తి తదితరులున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో డీఎస్పీ తనిఖీ

రొళ్ల, మార్చి 27: మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామమైన కేభ్యాడిగిర చెక్‌పోస్టు ప్రాంతంలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో పెనుకొండ డీఎస్పీ బాబు జాన్, మడకశిర సీఐ రాజకుమార్, రొళ్ల ఎస్ఐ రాజశేఖర్ చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా నేత్రం ఉంటుందని, ఎన్నికలు ముగిసే వరకు చెక్‌పోస్టులలో తనిఖీలు ఉంటాయని వారు తెలిపారు.

వాహన తనిఖీలు



బిల్లులు లేకుండా పట్టుబడిన చీరలను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

పెనుకొండ టౌన్, మార్చి 27: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. పెనుకొండ పట్టణంలోని ఎన్టీఆర్, తండా, వద్దిహట్టి క్రాస్‌రోడ్డులో బుధవారం వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తరుణంలో కొనుగోలు చేసిన వస్తువులపై ఆరాతీశారు. బిల్లులు లేని వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తరుణంలోనే ముందస్తు వాహన తనిఖీలు, గ్రామీణ ప్రాంతాల్లో స్వైర్యంగా ఓటు వేసేవిధంగా బీఎస్ఎఫ్ సిబ్బందితో కవాతు చేపడుతున్నట్లు తెలిపారు. కార్డెన్ సర్చ్ తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బిల్లులు లేకుండా వస్తువులు, నగదు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న సవిత

హిందూపురం అర్బన్, మార్చి 27: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె బుధవారం పరిగి మండలంలోని పీ నరసాపురం, కొత్తపల్లి, ఎన్ మద్దిరెడ్డిపల్లి, బీరేపల్లి, ధనాపురం, శాసకోట, హొస్సంపల్లి, జంగాలపల్లి, కే నరసాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పరిగిలో శ్రీకృష్ణుడి నిలువెత్తు విగ్రహానికి పూజలు చేసి... ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సవితకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ఒక్క ఛాన్స్‌తో సీఎం జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కు నెట్టాడన్నారు. మరో మారు అధికారం అందిస్తే మన ఆస్తులను సైతం తాకట్టు పెట్టేస్తారన్నారు. వైసీపీ పాలనలో మండలంలో ఒక్క అభివృద్ధి పని అయినా జరిగిందా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి శంకర్‌నారాయణ పెనుకొండ మండలంలో దోచుకుని వెళ్లాడన్నారు ఇప్పుడు మరో రెండు వలస పక్షులు వచ్చాయన్నారు. వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంత, ఉష నాగలోకల్ అన్నారు. తాను, టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి స్థానికులమన్నారు. టీడీపీ హయాంలో ఇక్కడ ఎంతో అభివృద్ధి జరిగిందని, వైసీపీ పాలనలో దాని జాడే లేదన్నారు. భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ, నాయకులు శశికళ శ్రీనివాస రెడ్డి, వడ్డెర హనుమయ్య ఈశ్వర, నరసింహులు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

పెనుకొండ టౌన్: పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని టీడీపీఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె గురువారం పట్టణంలోని తొటగేరిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక ధరలు పెరుగుదల, సంక్షేమ పథకాల్లో కోత, అరాచక పాలనపై సవిత మహిళలకు వివరించారు. అలాగే టీడీపీ మినీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ వార్డు ఇన్‌ఛార్జ్ ఉపాల నరేంద్ర, సాదిక్ షౌకత్, మాజీ వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, పూల శ్రీనివాసులు, మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, చంద్రకాంతమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్రతిష్ట పాల్జేసిన వైసీపీ

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న సునీల్‌కుమార్

అగళి, మార్చి 27: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. వైసీపీ రాష్ట్రాన్ని అప్రతిష్ట పాల్జేసిందని విమర్శించారు. ఆయన బుధవారం మండలంలోని హెచ్‌డీపల్లి, బ్యాడిగిర గ్రామ పంచాయతీల్లో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే ఈరన్న పాల్గొన్నారు. ప్రచారంలో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తొలుత దేవనహళ్ళిలో ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్రతిష్ట పాలు చేసిందన్నారు. రాష్ట్రంలో దౌర్జన్యాలు, దోపిడీలు అధికమై అభివృద్ధి సోమ కరేదన్నారు. పలుచోట్ల సమస్యలను తెలుసుకుని టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే మన ధ్యేయమన్నారు. రాష్ట్ర భవిష్యత్ ఆయనతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సాధికారత కన్వీనర్ పాండురంగప్ప, మాజీ ఎంపీపీ రామకృష్ణ, మాజీ జడ్పీటీసీలు రామకృష్ణ యాదవ్, చిదానందమూర్తి, మండల కన్వీనర్ కుమారస్వామి, నాయకులు రవి భూషణ్, ఉగ్రనరసింహ, కేపన్ పల్లి సురేష్, టీడీపల్లి మంజునాథ్, గోవిందప్ప, నాగేష్, అలీఖాన్, ఉమేష్, త్రిల్లర్‌మంజు, చిత్తానాధప్ప, క్యాతప్ప గుండప్ప కొట్ట రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలి

మాజీ ఎమ్మెల్యే ఈరన్న

గుడిబండ, మార్చి 27: ప్రతి తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. ఆయన బుధవారం గుడిబండ మండలంలోని ఎస్‌రాయాపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. మే13న జరగబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి, వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్ఎస్ రాయుడు, నాయకులు జయరాంరెడ్డి, మారేగౌడ్, కంత రాజు, నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అత్తారింటి వేధింపులకు మహిళ బలి

హిందూపురం అర్బన్, మార్చి 27: పట్టణంలోని సూరప్పకట్ట వద్ద ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో నివాసముంటున్న ఓ మహిళ అత్త, మామ, భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. డీఎస్పీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అమడగూరు మండలం చిన్నగానపల్లికి చెందిన శివయ్య, సుజాత పెద్ద కుమార్తె సింధు(22). ఆమెను నాలుగేళ్ల కిందట హిందూపురంలోని కల్లూరు సుబ్బారావు పార్కు ఎదురుగా ఉన్న అయ్యప్ప దేవాలయ నిర్వాహకుడు బాలాజీ, నిర్మల దంపతుల రెండో కుమారుడు రవిచంద్ర కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే తరుచు అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధించే వారని సింధు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో ఆమె బుధవారం ఉదయం విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె వాంతులు చేసుకుంటుండగా ఇరుగుపొరుగు వారు గమనించి యజమానులో ఉన్న అత్త మామలకు సమాచారం అందించారు. వారు వచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

టీడీపీతోనే ఇంటింటికి సంక్షేమం: నాయకులు



సుబ్బరాయపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, మార్చి 27: టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రతి కుటుంబానికి సంక్షేమం అందుతుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. హిందూపురం నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సుబ్బరాయపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి ఇంటికి ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, పూర్ టు రిచ్ కార్యక్రమంతో పేదలను ధనికులను చేయడం వంటి పథకాలు అందుతాయని వివరించారు. వైసీపీ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తు చేస్తూ... టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందని తెలిపారు. టీడీపీ నాయకులు శ్రీదేవి, బీకేరి గంగాధర్, సూర్యనారాయణ, పదిపల్లి గంగాధర్, మీసేవ సూరి, జగన్నాథ్‌రెడ్డి, హెదయతుల్లా, నారాయణప్ప, వెంకటసుబ్బయ్య, నాగార్జున, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చడంలో జగన్ విఫలం'

హిందూపురం, మార్చి 27: ఎన్నికల హామీలు నెరవేర్చడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్ అన్నారు. ఆయన బుధవారం ఎమ్మెల్యే నివాసం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రజలను మోసం చేయడానికి సీఎం జగన్ మరోసారి సిద్ధమయ్యారన్నారు. మాట తప్పను మడమ తిప్పను అని చెప్పే జగన్ ప్రజలే మడతపెట్టాలని, ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపాలన్నారు. ఒక్క అవకాశం పేరుతో ప్రజలకు బోకరా కొట్టి 83శాతం ఎన్నికల హామీలను గాలిలో కలిపిన ఘనత జగన్‌దేనన్నారు. సీపీఎస్ రద్దు, పూర్తిగా మద్య నిషేధం వంటి హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా అని నిలదీశా రు. కరెంట్ ఛార్జీలు పెంచమని చెప్పి తొమ్మిదిసార్లు పెంచారన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని వారి జీతాలు కూడా పెంచలేదన్నారు. ప్రతి జనవరి 1కి జాబ్ క్యాలెండర్ ప్రస్తే లేదన్నారు. అయినా 99శాతం హామీలు నెరవేర్చామని అబద్ధాలు చెబుతున్న జగన్‌కు ప్రజలు ఓటుతో బుద్ధిచెబుతారన్నారు. మరోసారి వైసీపీకి ఓటేస్తే ఈ రాష్ట్రం అంధకారంలోకి వెళ్లడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు రామాంజి, నాయకులు బాబి, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవిందరాజులు



ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందిస్తున్న న్యాయవాదులు

మడకశిరటౌన్, మార్చి 27: బార్ అసోసియేషన్ మడకశిర అధ్యక్షుడిగా జీ గోవిందరాజులను ఎన్నుకున్నట్లు న్యాయవాదులు తెలిపారు. మడకశిర బార్ అసోసియేషన్ ఎన్నికలను బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా జీ గోవిందరాజులు, ఉపాధ్యక్షుడిగా ఆర్ నాగేంద్ర, ప్రధాన కార్యదర్శిగా కే త్రిలోక్, ఉప కార్యదర్శిగా ఐ జయరాం, ట్రెజరర్‌గా సీకే హనుమంతరాయడు, లైబ్రేరియన్‌గా నాగరాజును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, అశ్వర్థనారాయణ, గోపాల్‌రావు, కిష్టప్ప, రఘునాథశర్మ, ఉమేష్‌చంద్ర తదితరులు ఉన్నారు.

హెచ్‌డీహళ్లిలో నీటికి కటకట

- ఎన్నిబోర్లు వేసినా దొరకని నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు




వద్దహట్టి గ్రామం



చుక్కనీరు పడని బోరు

అగళి, మార్చి 27: మండలంలోని హెచ్‌డీహళ్లి పంచాయతీ పరిధిలోని గ్రామస్తులు తాగు, సాగు నీటి కోసం చాలా అవస్థలు పడుతున్నారు. గత సంవత్సరం వర్షాలు కురవక బోర్లలో నీరు రావడం లేదు. దీంతో పంటలు సాగు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెచ్‌డీహళ్లి పంచాయతీ పరిధిలో గాయత్రి కాలనీ, తండా, వద్దహట్టి, దేవరహళ్లి, హళ్లికెర గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 550 కుటుంబాలుండగా, దాదాపు రెండు వేల జనాభా ఉంది. అయితే పంచాయతీ పరిధిలో గతంలో వేసిన పాత 30 బోర్లు ఎండిపోయాయి. కొన్నింటిలో అరకొరగా నీరు వస్తోంది. దీంతో రబీ సాగు కోసం ఈ మూడు నెలల కాలంలో కొత్తగా 25 బోర్లు తవ్వించారు. చాలా చుక్క నీరు కూడా నీరు కూడా లభ్యం కాలేదు. కొన్నింటిలో మాత్రమే అరకొరగా నీరు వస్తోందని ఆ పంచాయతీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో 800 నుంచి వెయ్యి అడుగుల వరకు బోరు తవ్వినా నీరు దొరకడం కష్టంగా ఉంటున్నారు. దీంతో తాగు నీటికి సైతం తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. హెచ్‌డీ హళ్లి గ్రామ పంచాయతీ ఆగళి మండలంలో కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉంది. వలు సమస్యలతో బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో, రైతులు జయమ్మ, దొడ్డన్న, బెట్టప్ప, రాజనాయక్, మల్లికార్జున, రాజేష్ తదితరులు మాట్లాడుతూ... బోరుబావుల కింద వక్క తోటలు, మామిడి, జామ, బొప్పాయి తదితర పంటలను సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. రెండేళ్ల కిందట ఆ పంచాయతీలో వర్షాలు బాగా కురి శాయన్నారు. దీంతో చెరువులు, కుంటలు నిండిపోవడంతో భూగర్భ జలమట్టం పెరిగి బోరుబావుల్లో నీరు సమృద్ధిగా వచ్చేదన్నారు. అయితే సంవత్సరకాలంగా వర్షాలు కురవకపోవడంతో బోర్లలో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. నీరు లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్న పంచాయతీ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు కోరారు.


హంద్రీనీవా జలాలతో చెరువులు నింపాలి



నాకు ఐదెకరాల పొలం ఉంది. ఆరు బోర్లు వేశా. నాలుగు బోర్లు ఫెయిల్ అయ్యాయి. మిగతా రెండు బోర్లలో అరకొరగా నీరు వస్తోంది. ఆ నీటితో పంటలు సాగు చేస్తున్నాం. హంద్రీనీవా జలాలను అగళి మండలానికి తెప్పిస్తే భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- దాదన్న, రైతు, దేవరహళ్లి

దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం



నాకు ఐదెకరాల పొలం ఉంది. పంటల సాగు కోసం పొలంలో గత 15ఏళ్లలో క్రితం ఒక రెండు బోర్లు వేయించా. అందులో ఒకదానిలో చుక్కనీరు కూడా రాలేదు. రెండోదానిలో అరకొర నీరు వస్తోంది. ఆ నీటితో పంటలు సాగుచేస్తున్నా. మా పంచాయతీ పరిధిలో 800నుంచి వెయ్యి అడుగులు బోరు తవ్వించినా నీరు పడటంలేదు. దీంతో ఇక్కడి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. కుటుంబ పోషణ ఎలా అని ఆందోళన కలుగుతోంది.

- బెట్టప్ప, రైతు, గాయత్రికాలనీ

ఘనంగా అభయాంజనేయుడికి మండల పూజ



27 అడుగుల ఏకశిలా విగ్రహం

హిందూపురం అర్బన్, మార్చి 27: స్థానిక దండు రోడ్డులో జలేకల 27 అడుగుల ఏకశిలా విగ్రహం ఏర్పాటు చేసి మండల కాలం పూర్తయింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో బుధవారం మండలపూజ భాగంగా కలశారాధన, హోమాలు నిర్వహించారు. అనంతరం క్రేన్ సాయంతో భారీ ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకాలు చేశారు. సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాల కు ప్రత్యేక పూజలు చేశారు. రామనామస్మరణ, ఆంజనేయ దండకంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణస్వామి, చౌడేష్, ప్రభాకర్, వెంకటేష్, ప్రియగంగాధర్, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఆంజనేయస్వామికి బీకే ప్రత్యేక పూజలు



చందకచర్లలో పూజల్లో పాల్గొన్న బీకే పార్థసారథి

రొద్దం, మార్చి 27: టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి బుధవారం మడకశిర మండలంలోని చందకచర్ల ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందుకున్నా రు. ఎన్నికల ప్రచారానికి ముందు చందకచర్ల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారంలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. అనంతరం పరిగిలోని బీరప్పస్వామి దేవాలయంలో పూజలు చేశారు. ఆయన వెంట హరీష్, చంద్ర, నారాయణ, మున్నా తదితరులు ఉన్నారు.

పార్థసారథికి గుండుమల అభినందనలు



బీకేకు అభినందనలు తెలుపుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, మార్చి 27: తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా బీకే పార్థసారథిని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడంతో బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆయనను కలిశారు. పెనుకొండలోని ఆయన స్వగృహంలో గుండుమల తిప్పేస్వామి కలిసి అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రచారం తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా కురుబ సాధికార కన్వీనర్ గోవిందప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నాగరాజు, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

మండల అధికారులు

గోరంట్ల, మార్చి 27: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చౌక డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను అధికారులు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ అబ్దుల్ బాషా, ఎంపీడీఓ శివశంకరప్ప అధికారి ప్రవీణ్‌కుమార్, సీఎస్‌డీటీ శ్రీధర్ బుధవారం చౌక డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల మాట్లాడుతూ... చౌకడిపోల్లో, ఎండీయూ వాహనాల్లో సీఎం, పీఎం, ఇతర రాజకీయ నాయకుల చిత్రపటాలు ఉండరాదని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసే వస్తువులపై వారి బొమ్మలుంటే కనబడ కుండా చేయాలన్నారు. సరుకులు పంపిణీ చేసే సమయంలో రాజకీయ ప్రచారం చేసినా, నేతల వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా విచారణ చేసి, వారిని విధులనుంచి తొలగిస్తామన్నారు. మహిళా డీలర్లు వారి కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో అజాగ్రత్తగా వ్యవహరిస్తే... సీ -విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.

'ఎఫ్‌సీఆర్ఏను వెంటనే రెన్యువల్ చేయాలి'



సేవ్ ఆర్డీటీ ప్లకార్డులతో కులసంఘాలు, ప్రజాసంఘాల నాయకులు

పెనుకొండ, మార్చి 27: కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తున్న ఆర్డీటీ విదేశాల నుంచి నిధులు వచ్చేందుకు ఎఫ్‌సీఆర్ఏను ప్రభుత్వం వెంటనే రెన్యువల్ చేయాలని అంతర్జాతీయ మానవహక్కుల పోరాటమండలి జిల్లా అధ్యక్షుడు సమీవుల్లా కోరారు. స్థానిక ఎన్‌ఎస్‌యూ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పోరాటమండలి సభ్యులు, ప్రజాసంఘాలు, కులసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఆర్డీటీని కాపాడుకునేందుకు రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ముందుకు రావాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, పెద్దన్న, కౌన్సిలర్ శేషాద్రి, నరసింహులు, గంగన్న, ఎహెచ్‌ఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, బాబావలీ, ఖాన్‌బాషా, మురళినాయక్, డిష్ ఆదిశేషయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బండి మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం

పెనుకొండ, మార్చి 27: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి చరిత్రపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో బుధవారం విజేతలుగా నిలిచిన నలుగురు మహిళలకు ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుదాకర్‌గుప్త, యాడికి నాగరాజు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదినం

పావగడ, మార్చి 27: తెలుగు చిత్రసీమ అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ తేజ్ 39వ జన్మదిన వేడుకలను పావగడ హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం వైభవంగా జరుపుకొన్నారు. మెహర్ బాబా ఆశ్రమంలో వీధి వ్యాపారులతో కలిసి మానం శశికిరణ్ కేక్‌కట్‌చేశారు. అనంతరం వేసవి తాపం నుంచి రక్షించుకునేందుకు 70 మంది వీధి వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షురాలు శశికళ, ఆటో సంఘం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'గుంటూరు సభను విజయవంతం చేయండి'

మడకశిరటౌన్, మార్చి 27: గుంటూరులో ఈనెల 30న జరి గే మండల నాయకుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సాప్రాట్ కేజీ మధు పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మడకశిర ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం... దండోరా... ఎన్నికల నేపథ్యంలో... సభకు... ఈసభకు... ఉల ఆమలు కోసం గుంటూరులో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నల్లూరులో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రొద్దం, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని నల్లూరులో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. పెనుకొండ రూరల్ సీఐ రాజ్ కుమార్, ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ జవాన్లతో కలిసి కవాతు సాగింది. నల్లూరు సమస్యాత్మక గ్రామం కావడంతో ఎన్నికలప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో జమేదార్ కాంతప్ప, నాగరాజు, కుమార్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.